క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువై ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం జేష్ఠ మాసం చవితి పురస్కరించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్న సమారాధన చేశారు.

నరేష్‌కు జగనన్న ఆణిముత్యం అవార్డు


నరేష్

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కందిబొట్టు నరేష్ జగనన్న ఆణిముత్యం నియోజకవర్గ స్థాయి అవార్డుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రంగంపేట గ్రామానికి చెందిన నరేష్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని హెచ్ఈసీ గ్రూప్‌లో 692 మార్కులు సాధించాడని చెప్పారు. నరేష్ తండ్రి కె.శ్రీను వ్యవసాయ కూలీ కాగా తల్లి కె.దుర్గ గృహిణి అన్నారు.

ముందస్తు ఖరీఫ్‌కు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శామ్యూల్ జాన్

బిక్కవోలు: రైతులు ముందుస్తు ఖరీఫ్‌కు సిద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి శామ్యూల్ జాన్ అన్నారు. మంగళవారం బలభద్రపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జాన్ మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో కాలువలు విడుదల చేస్తారు కనుక రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, నీటిపారుదల ఏఈ సజిని, ఏఈఎస్ రంగారావు, కోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

రంగంపేట: వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం, వికాసం, వినోదం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. రీసోర్స్ పర్సన్ షేక్ వలీ పాల్గొని శక్తి, యుక్తి నీతి కథలు చెప్పారు. దేశభక్తి గీతాలు, ఇంగ్లిష్ పద్యాలు నేర్పించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడకుండా పుస్తక పఠనంపై శ్రద్ధ చూపాలని రామకోటేశ్వరరావు సూచించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

అద్దె విషయంలో వివాదం

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి వేదాస్ ఆసుపత్రి వద్ద మంగళవారం అద్దె విషయంలో వివాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్లితే.. డాక్టర్ ఘంటా గణేశ్వరరావు ఆ భవనాన్ని మద్దుకూరి లక్ష్మికి అద్దెకు ఇవ్వగా వేదాస్ పేరుతో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. అయితే పదిహేను నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో గణేశ్వరరావు, తమ్ముడు కొడుకు శ్రీనివాస్ తదితరులు అద్దె చెల్లించాలని కోరుతున్నా వాయిదాలు వేస్తూ రోజులు గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వేదాస్ ఆసుపత్రికి ఘంటా శ్రీనివాస్ తదితరులు వెళ్లి అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో మద్దుకూరి లక్ష్మి తనకు రక్షణ కల్పించాలని 100కు కాల్ చేశారు. స్థానిక పోలీసులు వెళ్లి ఇరువర్గాలతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం అద్దె చెల్లిస్తానని లక్ష్మి చెప్పడంతో ఘంటా శ్రీనివాస్ తదితరులు వెనుతిరిగారు. మళ్లీ మంగళవారం వెళ్లి అద్దె చెల్లించాలని కోరగా ఆసుపత్రి నిర్వాహకురాలు లక్ష్మి ఆసుపత్రి బయట టెంట్ వేసి, తనను వేధిస్తున్నారని నిరసన తెలపడానికి ప్రయత్నించారు. టెంట్‌కు అనుమతి లేదంటూ పోలీసులు అభ్యంతరం తెలపడంతో టెంట్‌ను తొలగించారు. లక్ష్మి భర్త రాజమహేంద్రవరం నుంచి రాగా రాత్రి 9.30 గంటలకు రాగా, ఆసుపత్రి భవనం ఖాళీ చేయాలని శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి బయటకు వచ్చిన లక్ష్మి తన చేతిని కోసుకుని, భర్తతో రాజమహేంద్రవరం వెళ్లారు. ఈ సందర్భంగా ఘంటా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ చిన్నాన్నకు పదిహేను నెలలుగా అద్దె చెల్లించడం లేదని, రూ.15 లక్షల వరకు బాకీ ఉందన్నారు. అద్దె చెల్లించాలని అడుగుతుంటే తమపై దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు దిగుతున్నారన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సంపత్ నగరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సంపత్‌నగరంలో గడపగడపకూ..

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. జగన్ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వారికి వివరించారు.

ఆప్యాయంగా పలకరింపు

సంపత్‌నగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఘనంగా స్వాగతం లభించింది. ప్రజలు ఆయనను ఆప్యాయంగా పలకరించారు. తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు మాదిరిగానే ప్రజల సమస్యలను తీర్చడానికి నిరంతరం పనిచేస్తున్నారని కొనియాడారు. ఓ అవ్వ మాట్లాడుతూ 'పెన్షన్ కోసం కాకినాడ, రాజానగరం ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాను, ఎవరూ పట్టించుకోలేదు, మీరు అధికారంలోకి వచ్చాక మిమ్మల్ని కలిస్తే వెంటనే మంజూరైంది' అని ఆనందం వ్యక్తం చేసింది. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడిని ఎమ్మెల్యే రాజా పలకరించారు. మంచి వైద్యం అందేలా చూస్తానని భరోసానిచ్చారు. అనారోగ్యంతో మంచాన ఉన్న ఒక వృద్ధురాలి చెంతకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, గ్రామ సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక అమ్మిరాజు, నాయకులు లంక ఆదినారాయణ, లంక మాచరావు, పి. వెంకటేశ్వర్రావు, కోనే మురళి, మదిరెడ్డి వెంకన్న, రాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం


కైకవోలులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ కేతా తులసి తదితరులు


పందలపాకలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. కైకవోలు, కుమారప్రియం, పెద్దాడ సర్పంచులు నూని పట్టాభిరామన్న చౌదరి, దోకుబుర్ర మీనాక్షి అధ్యక్షతన గ్రామ వలంటీర్లను సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతో కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, ఉప సర్పంచ్ కొప్పిశెట్టి వీరశంకర్, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, పెమ్మనబోయిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు సెల్యూట్

బిక్కవోలు: ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తామున్నామని భరోసానిస్తున్న వలంటీర్లకు సెల్యూట్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. మంగళవారం పందలపాక సచివాలయం-1 వద్ద నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వలంటీర్లను సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, మండల జేఏసీ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, గండి వాసు, పడాల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు


రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకూ నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మొదటి ఏడాది విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, రెండో ఏడాది విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించకూడదనే నిబంధన ఉన్న నేపథ్యంలో కేంద్రానికి విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్‌గా కేవీఆర్ కృష్ణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పి.రామాంజనేయులు వ్యవహరిస్తారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో దాత కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

గోకవరానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన తుపాకుల గణేష్, తుపాకుల బాపనమ్మ, మేడిశెట్టి సత్యవేణి, కంచర్ల అవినాష్‌లు పార్టీలోకి చేరగా వీరికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, చింతల అనిల్‌కుమార్, పెద్దాడ వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

వలంటీర్లు సంక్షేమ సారథులు

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


గోకవరంలో అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 20 సచివాలయాల్లో 276 మంది వలంటీర్లు ఉండగా ఇద్దరు సేవావజ్ర, ఐదుగురు సేవారత్న అవార్డులకు, 269 మంది సేవామిత్రలకు ఎంపికయ్యారు. వీరందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లుకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ ఏటా గౌరవిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలుపొంది నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో పార్టీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, గుల్లా ఏడుకొండలు, తోలేటి రాంప్రసాద్, బద్దిరెడ్డి అప్పన్నదొర, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు, ఎంపీడీఓ కెఎస్ ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి పరీక్ష.. భూమికి రక్ష..

- భూసార పరీక్షలతో ఎంతో మేలు
- ఆర్‌బీకేల సాయంతో నిర్వహణ
- రైతులకు విస్తృతంగా అవగాహన


కానవరంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

రాజానగరం: పొలాల్లో ఇష్టానుసారంగా పంటలను సాగు చేయడం వల్ల భూసారం దెబ్బతింటుంది. తద్వారా రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తమ పొలాల్లో మట్టి నమూనాలు తీసి, భూసార పరీక్ష చేయించడం ఎంతో మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనివల్ల ఏ పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడొచ్చు, ఏ సమయాల్లో సస్యరక్షణ చేపట్టవచ్చో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు 2014–15లో జిల్లాలో పలు గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేశారు. వాటి ఆధారంగా రైతులకు కార్డులు అందజేశారు. భూసార పరీక్ష ద్వారా వచ్చిన రిపోర్టును అనుసరించి ఆయా భూములలో ఏ పంటలు పండించాలి, ఏ ఎరువులు వాడాలో తెలియజేశారు. తదుపరి కూడా ఈ కార్యక్రమం కొనసాగుతూ వస్తుంది.

ఇష్టానుసారంగా ఎరువుల వాడకం

చాలామంది రైతులు తమ పొలాల్లో అధిక దిగుబడులు సాధించాలనే కోరికతో ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వాడుతుంటారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా చీడపీడలు ఎక్కువై, పంట దిగుబడులు తగ్గేందుకు అవకాశం ఉంది. అందుకనే పోషకాల సమతుల్యతను పాటించడానికి, రసాయన ఎరువులు సరైన మోతాదులో వాడటానికి భూసార పరీక్షలు ఎంతో అవసరం.

జాగ్రత్తలు తీసుకోండి

ప్రతి రైతు సాగుచేసే పొలంలో సూక్ష్మ పోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సూక్ష్మ పోషకాలుగా పిలువబడే జింకు, బోరాన్, జిప్సమ్ (కాల్షియం, గంధకం) లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుని దిగుబడులను పెంచుకోవచ్చు. ఖరీఫ్ సాగుకు ముందుగానే ప్రతి రైతు తమ పొలాలలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇందుకుగాను 50 శాతం రాయితీపై రైతాంగానికి సూక్ష్మ పోషకాలను వ్యవసాయశాఖ ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తుంది.

> **భూసార పరీక్షలు చేయిస్తున్నాం**
>
> రైతులు కోరితే వెంటనే మట్టి నమూనాలు తీసుకుంటున్నాం. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు దగ్గర్లోని రైతు భరోసా కేంద్రాన్ని (ఆర్‌బీకే) సంప్రదించాలి. ఆపై మట్టి నమూనాలు తీసుకుని, భూసార పరీక్షలు చేయించవచ్చు. భూసారం బాగుంటేనే దిగుబడులు బాగుంటాయనే విషయాన్ని రైతులు గ్రహించాలి. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే వాటిని సాగుచేసుకొని, వేసవి దుక్కులు చేయడం మంచిది.
>
> – కేఎస్ రమేష్, వ్యవసాయాధికారి, సీతానగరం

నేడు తుమ్మలపల్లిలో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి గ్రామ శివారు తుమ్మలపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు

పెదపూడి: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తామని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. పెదపూడిలోని రెండు రైతు భరోసా కేంద్రాల వద్ద రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా పంట సాగుదారు హక్కు పత్రం అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మణిదీప్ మాట్లాడుతూ హక్కు పత్రాల ద్వారా వాస్తవ సాగుదారునికి ఈ–పంట నమోదు, పంట నష్ట పరిహారం, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీ, కనీస మద్దతు ధర, ధాన్యం కొనుగోలు వంటి పథకాలన్నీ వర్తిస్తాయన్నారు.

మజ్జిగ వితరణ

సీతానగరం: చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్ వద్దగల షిర్డీసాయి వసతి మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాతలు దండు వీర ప్రదీప్ రాజు, దండు ప్రాసవి, వర్మ సౌజన్యంతో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వితరణ చేశారు.

కొనసాగిన అటల్ ల్యాబ్

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ క్యాంపు రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఎంఈఓ కుశలవ దొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ అంశాలను విద్యార్థులు కొన్ని ప్రయోగాలు చేశారు. దానిలో భాగంగా పలు వస్తువులు తయారు చేశారు. ప్రదర్శన నిమిత్తం ఉంచిన వాటిని ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

యువతి అదృశ్యం

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన 21 ఏళ్ల బర్ల మీనా కనిపించడం లేదని అమ్మమ్మ సిద్దె లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 21వ తేదీ రాత్రి 9 గంటలకు పడుకున్నామని, తర్వాత కనిపించలేదని తెలిపింది. వంగలపూడికి చెందిన సురేంద్రతో ఆమెకు ప్రేమ వ్యవహారం ఉందని, అతడితో వెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన పదిహేనేళ్ల బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాపాకకు చెందిన బావిశెట్టి రాహుల్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఇప్పుడు వేరే అమ్మాయితో నిశ్చితార్థానికి సిద్ధమయ్యాడని బాలిక ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశామని, డీఎస్పీ విచారణ నిర్వహిస్తారని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు మంగళవారం తెలిపారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అందరి సంక్షేమం


శ్రీరంగపట్నంలో గడపగడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న జక్కంపూడి గణేష్

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్
- శ్రీరంగపట్నంలో గడపగడపకూ

మధురపూడి: వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం నాలుగోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఎమ్మెల్యే నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయం వ్యవస్థలతో పథకాలు పేదల ముంగిటకు చేరుతున్నాయన్నారు.

ఘన స్వాగతం

జక్కంపూడి గణేష్ ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సుమారు 250 గడపలు తిరిగారు. మహిళలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు మురుగునీటి కాలువల నిర్మాణం చేయాలని కోరారు. అలాగే నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం శ్రీరంగపట్నంలో అమలు జరగలేదన్నారు. 12 వేల మంది జనాభా గల మేజర్ పంచాయతీలో పేదలకు స్థలాలు ఇవ్వలేదన్నారు. దీనిపై గణేష్ మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి తీసుకెళ్లి స్థలాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు మద్దాల రమణ, కొయిడాల నానాజీ, అత్తిలి రాంప్రసాద్, సూరిశెట్టి కుటుంబరావు, తనకాల ప్రసాద్, గుదే రాము, శ్రీరంగపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుద్దా శ్రీనివాస్, ఎంపీటీసీ తనకాల నూకరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


అనపర్తి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

అనపర్తి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ నాయకులు మంగళవారం అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు క్రాంతిప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏఆర్ శివకుమార్, అసోసియేట్ చైర్మన్ అహ్మద్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి ఆదిరెడ్డి తదితరులున్నారు.


గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

- ఒక ఎక్సావేటర్, మూడు టిప్పర్ లారీలు సీజ్
- పలువురిపై కేసు నమోదు


గ్రావెల్ క్వారీపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

గోకవరం: రంపయర్రంపాలెం పంచాయతీ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఒక ఎక్సావేటర్, మూడు టిప్పర్లను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు నాగమ్మకు చెందిన సర్వే నెంబర్ 389/16లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతుందని తమకు సమాచారం అందిందన్నారు. ఈ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి, తవ్వకాలు నిర్వహిస్తున్న ఒక ఎక్సావేటర్, రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. ఆ ప్రాంతంలో 4,827 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వకాలు నిర్వహించినట్టు అంచనా వేశామన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుమ్మళ్లదొడ్డికి చెందిన మిర్తిపాటి వెంకటనాగజ్యోతి స్వరూప్, భూ యజమాని, ఆపరేటర్లు, డ్రైవర్లు తదితరులపై కేసు నమోదు చేయాలని గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ, రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు.

525 మందికి వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 525 మందికి వైద్య సేవలు అందించారు. వారికి అవసరమైన పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని ఇళ్ల వద్ద మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్లు దుర్గ, కుమారి, శర్మిల పాల్గొన్నారు.